క్లుప్తంగా

ఫొటో దిగి వెళ్లిపోయారు


ప్రజావాణికి హాజరైన అధికారులు

దౌల్తాబాద్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు రాలేదు. ఉ.11గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా 11.30 గంటలకు ప్రారంభమైంది. 16శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు పాల్గొనాల్సి ఉంది.. కేవలం విద్యుత్, ఐసీడీఎస్, ఉపాధి, ఐకేపీ, పశుసంవర్ధక శాఖ అధికారులు మాత్రమే హాజరయ్యారు. గంటసేపు కూర్చుని ఓ ఫొటో దిగి వెళ్లిపోయారు. ప్రజావాణిపై ప్రజలకు సమాచారం లేకపోవడం, ఆయాశాఖల అధికారులు రాకపోవడంతో తూతూమంత్రంగా సాగింది.

మిత్రుడికి ఆర్థిక సహాయం


చెక్కు ఇస్తున్న మిత్రుడు

నవాబుపేట: ఆపదలో ఉన్న మిత్రుడికి తోటి మిత్రులు అండగా నిలిచారు. మండలంలోని లింగంపల్లికి చెందిన తలారి శంకర్ తెలంగాణ వాణిజ్య పన్నులశాఖలో అసిస్టెంటు కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాడు. అతని తండ్రి నర్సింలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. తండ్రి వైద్యానికి శంకర్ కొంత మొత్తం ఖర్చు పెట్టి.. ఆర్థికంగా శంకర్ ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్రులు అతనికి రూ. 46, 2000 చెక్కు అందజేశారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

తహసీల్దార్ అంజయ్య


అంజయ్య, తహసీల్దార్


నరేష్, డిప్యూటీ తహసీల్దార్

యాలాల: నూతనంగా తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించిన అంజయ్య భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. గ్రామీణ ప్రాంతవ మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా చూస్తానన్నారు. అలాగే, నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా నరేష్ సోమవారం విధుల్లో చేరారు. ఇంతకుముందు ఇక్కడ డీటీగా పని చేసిన లక్ష్మణ్ హైదరాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నరేష్ బాధ్యతలు స్వీకరించారు.

కలుషితం కాకుండా చర్యలు


సమస్యను తెలుసుకుంటున్న మంజుల

అనంతగిరి: తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని 30వ వార్డులో యూజీడీ సమస్యతో తాగునీరు కలుషితం అవుతుందని కౌన్సిలర్ సువర్ణ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, అధికారులతో కలిసి ఆమె కాలనీలో పర్యటించి సమస్య తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు. యూజీడీ లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట కమిషనర్ జాకీర్‌అహ్మద్, మెప్మా ఇన్‌చార్జి వెంకటేశం ,నాయకులు రంగరాజు, శ్రీనివాస్, వసంత్ కుమార్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నిరుద్యోగులు

అనంతగిరి: సీఎం రేవంత్‌రెడ్డి జాబ్ కేలెండర్ రిలీజ్ చేసిన సందర్భంగా వికారాబాద్‌లోని పలువురు నిరుద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగులు రాములు, శ్రీనివాస్, కృష్ణ, పాండు, శేఖర్ పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం

స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని అన్ని గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ర్యాలీలు నిర్వహించి, అవగాహన కల్పించారు. పలుచోట్ల మొక్కలు నాటారు. వ్యక్తిగత శుభ్రత, తడి, పొడిచెత్త వేరు చేయడం, డ్రైనేజీల మరమ్మతులు, కుక్కల బెడద వంటి పలు సమస్యల పరిష్కారంపై ప్రజలకు వివరించారు.

–సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల


బంట్వారంలో..


రాంపూర్‌లో ..


పూడూరు: తిర్మలాపూర్‌లో ర్యాలీ


మోమిన్‌పేట: ఎన్కేపల్లి పాఠశాలను పరిశీలిస్తున్న పూర్ణచందర్‌రావు


పరిగి: ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ తదితరులు


పెద్దేముల్: కందనెల్లిలో పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శంకర్‌నాయక్


కొడంగల్ : మొక్కలు నాటుతున్న గురునాథ్‌రెడ్డి


కుల్కచర్ల: బండవెల్కిచర్లలో..


పరిగి: సుల్తాన్‌పూర్‌లో గ్రామసభ


నవాబుపేట: చించల్‌పేటలో ర్యాలీ


మర్పల్లి: ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, టీచర్లు


దోమ: అవగాహన కల్పిస్తున్న అధికారులు


పెద్దేముల్ : మంబాపూర్‌లో ..


కొడంగల్ : ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్


దుద్యాల్‌లో అవగాహన ర్యాలీ


కుల్కచర్ల: మురుగుకాల్వలను శుభ్రం చేయిస్తున్న కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి

మోమిన్‌పేట డీటీగా సురేష్‌నాయక్



మోమిన్‌పేట: మోమిన్‌పేట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా సురేష్‌నాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు కొడంగల్‌లో పని చేసి బదిలీపై మోమిన్‌పేటకు వచ్చారు. గత 12 సంవత్సరాల క్రితం మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహించారు. రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

గర్భిణులకు అవగాహన

కొడంగల్: మండలంలోని గర్భిణుల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీరామకృష్ణ సేవాసమితి, లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ శివారులోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉ. 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యులు సలహాలు, సూచనలు ఇస్తారని నిర్వాహకులు తెలిపారు. వికారాబాద్ జిల్లా ఉప వైద్యాధికారి లయన్ డాక్టర్ రవీంద్రా యాదవ్ పాల్గొంటారని చెప్పారు.

అదనపు బస్సు నడపాలని ధర్నా


బస్సు ఎదుట బైఠాయించిన విద్యార్థులు

బంట్వారం: ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల సమయానికి అదనపు బస్సును నడపాలని సోమవారం మండలంలోని సల్బత్తాపూర్ గ్రామ విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సు ఉ.7:30 గంటలకు బంట్వారం చేరుకోవడంతో తాము రెండు గంటల ముందు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఉదయం నడిపే బస్సును యథావిధిగా కొనసాగించడంతో పాటు పాఠశాల సమయానికి ఉ. 9 గంటలకు మరో బస్సు నడిపించాలని డిమాండ్ చేశారు. పాఠశాల సమ యం కంటే రెండున్నర గంటల ముందుగా వెళ్లడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని వాపోయారు. తాండూరు ఆర్టీసీ డీఎం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో డిపో ఎదుట పెద్ద ఎత్తున ధర్నాకు దిగుతామని హెచ్చరించారు.

నిషేధిత కలుపు మందుతో ప్రమాదం

- జోరుగా వాడుతున్న అన్నదాతలు
- గుట్టు చప్పుడు కాకుండా దిగుమతి
- నిద్రావస్థలో అధికారులు

దుద్యాల్ : నిషేధిత కలుపు మందు గుట్టు చప్పుడు కాకుండా కొందరు దళారులు కర్ణాటక నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో పల్లెల్లో పత్తి రైతులు నిషేధిత కలుపు మందును జోరుగా వినియోగిస్తున్నారు. వికారాబాద్ జిల్లా, నారా యణపేట జిల్లాలకు సరిహద్దుగా కర్ణాటక రాష్ట్రం ఉండటంతో అక్కడి నుంచి అలవోకగా దిగుమతులు చేసుకుంటున్నారు. వికారాబాద్ జిల్లాలోని అన్ని మండలాలు, అన్ని గ్రామాలకు కర్ణాటక సరిహద్దు 40 కిలోమీటర్ల దూరం ఉండడంతో దిగు మతి తేలిక. పత్తి పంటలో గడ్డి కలుపు నివారించేందుకు క్లింటన్ మందును తెలంగాణలో ఏ ఒక్క ఫర్టిలైజర్ దుకాణాల్లో అమ్మకాలు చేపట్టకుండా నిషేధించారని పలువురు ఫర్టిలైజర్ షాపు యజమానులు చెప్పారు. కానీ, గ్రామీణ ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా కొంతమంది దళారులు నిషేధిత మందులను రైతులకు అమ్మకాలు అమ్ముతున్నట్లు సమాచారం. నిర్మూలించాల్సిన టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలాగే కొనసాగితే రైతులు నష్టపోయే అవకాశం ఉందని ప్రజలు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిషేధిత గడ్డి మందు వాడిన చోట పశువులు మేత మేస్తే అక్కడికక్కడే చనిపోయే ప్రమాదం ఉందని పశువుల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేసి దళారులను పట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.



పత్తి పంటకు వాడిన నిషేధిత గడ్డి మందు డబ్బా

ప్రత్యేక పూజలు

తాండూరు రూరల్: శ్రావణమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని భదేశ్వరస్వామి ఆలయంలోని శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ రాజరాజేశ్వరి స్వామిగా అలంకారణలో భక్తులకు శివయ్య దర్శనమిచ్చారు.

శ్రావణమాసం పూజలు

పరిగి: శ్రావణమాసం తొలి సోమవారం ఆలయాలు భక్తులతో కిటకిలాడాయి. శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రావణమాసం ఎంతో పవిత్రమైందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు.


రాజరాజేశ్వరిస్వామిగా శివుడు

మా సమస్యలు పరిష్కరించండి


ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్: మా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సోమవారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. విద్యాశాఖలో గత 20 ఏళ్లుగా సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు పని చేస్తున్నామన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని వాపోయారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తాండూరు డివిజన్ కురుమ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కురుమ సంఘం భవనానికి ఎమ్మెల్యే భూమి ఇచ్చారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రుల చేతుల మీదుగా ప్రొసీడింగ్ ఇవ్వడం సంతోషకరమన్నారు. జగదీష్, మల్లప్ప, నర్సింలు, హనుమయ్య, బాలు, కిష్టప్ప, నర్సింలు ఉన్నారు.

అన్నదానం మహాదానం

శుభప్రద్ పటేల్


నిత్యాన్నదానం ప్రారంభించిన శుభప్రద్‌పటేల్

అనంతగిరి: అన్నదానం మహాదానమని రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. శ్రావణమాసం పురస్కరించుకుని వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రావణమాసంలో అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తే కష్టాల నుంచి బయటపడుతామన్నారు. కార్యక్రమంలో వీరశైవ సమాజం వికారాబాద్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఆలయ ట్రస్టీ చైర్మన్ ఆత్మలింగం, వీరశైవ సమాజం ప్రతినిధులు వీరన్న, బస్వలింగం పటేల్ పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ


బ్యాగులు అందజేస్తున్న సభ్యులు

దుద్యాల్: పేద విద్యార్థులకు ఆశ్రయ సంస్థ అండగా ఉంటుందని ఆ సంస్థ ఫీల్డ్ అధికారి అంజద్‌హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని పోలేపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, చెప్పులు, యోగా మ్యాట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మా వంతు సహకారం ఉంటుందన్నారు. అలాగే, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన లేబర్ కార్డు విశిష్టత, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోస్గి మండల జన సమితి నాయకుడు అనిల్, పంచాయతీ కార్యదర్శి రాధిక, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత రైతుకు ఆర్థిక సాయం

ధారూరు: మండల పరిధిలోని ఎబ్బనూర్‌లో జూలై 23న పిడుగుపాటుకు ఓ ఎద్దు మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టి తెచ్చాడు. స్పందించిన ఆయన బాధిత రైతుకు రూ.15వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ నగదును గ్రామ రాజేందర్‌రెడ్డి రైతుకు అందజేశారు.


రాజయ్యకు నగదు అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి

తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రభ

దుద్యాల్ : పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యమని హస్నాబాద్ క్లస్టర్ సూపర్‌వైజర్ ప్రభ అన్నారు. సోమవారం మండలంలోని హస్నాబాద్ గ్రామంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలు మొదటగా తాగించాలని, పాలు ఇవ్వడం వల్ల తల్లికి కూడా చాలా మంచిదన్నారు. కార్యక్రమంలో బస్తీ దవాఖాన డాక్టర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు మంగమ్మ, పద్మ, సాబేరా, అనుసూయ, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న విజయలక్ష్మి

రోగ నిరోధక శక్తి అధికం

మర్పల్లి: బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టాలని అంగన్‌వాడీ వర్కర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఘణాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ బాలికలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. తల్లిపాలు సులభంగా జీర్ణమవుతాయన్నారు. కార్యక్రమంలో మహిళలు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

‘స్వచ్ఛంద’ నిర్ణయం తగదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

కొడంగల్ రూరల్ : మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ స్వచ్ఛంద సంస్థకు అప్పజెప్పడం విరమించుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తహసీల్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఏళ్లు గా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న తమకు అన్యాయం చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఫిక్స్‌డ్ వేతనం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వినతితో తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, కార్మికులు వెంకటలత, లక్ష్మి, లావణ్య, సరిత, సరళ, వెంకటమ్మ, స్వాతి, నర్సమ్మ, మొగులమ్మ తదితరులు పాల్గొన్నారు.